Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం – మననేత్రం

Follow

పేజీలు 12

శనివారం, 26 ఏప్రిల్, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## అఘోరి అరెస్ట్... విచారణ... హై డ్రామా..



మెదక్, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే): ఘోరీ.. తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా హల్‌చల్ చేస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యువకుడు శ్రీనివాస్ అఘోరీగా మారినట్లు ప్రచారం చేసుకుంటున్నాడు. శ్మశానంలో పూజలు, రోడ్లపై హల్‌చల్ చేస్తూ.. పోలీసులను, సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాడు. ఇటీవల ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. అఘోరిపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో అరెస్టు చేశారు. అతడిని జైలుకు తరలించే క్రమంలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా హల్‌చల్ చేస్తున్న అఘోరీ తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి. అతడి వయసు 27 ఏళ్లు. కేదార్‌నాథ్‌లో సాధువుగా జీవిస్తున్నాడు. అతను తన కలలో 'అర్ధనారీశ్వర' రూపాన్ని చూసినట్లు పేర్కొన్నాడు, దీని స్ఫూర్తితో లింగ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవాలని నిర్ణయించాడు. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరిగినట్లు వైద్యులు గుర్తించారు.



# గడువు తరువాత ఏ పాకిస్తానీని దేశంలో ఉండనివ్వకండి

## సిఎంలు అందరికీ ఫోన్‌లో అమిత్ షా పిలుపు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 25:** కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి, దేశం వీడేందుకు నిర్దేశించిన గడువు తరువాత ఏ పాకిస్తానీనీ భారత్‌లో ఉండనివ్వరాదని ఆదేశించినట్లు అభిజ్ఞ వర్గాలు వెల్లడించాయి. పాకిస్తానీలకు జారీ చేసిన అన్ని వీసాలను ఈ నెల 27 నుంచి రద్దు చేస్తున్నట్లు భారత్ గురువారం ప్రకటించింది. మంగళవారం పహల్‌గామ్‌లో పర్యాటకులతో సహా 26 మంది వ్యక్తులను బలిగొన్న ఉగ్ర దాడిపై రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యం లో సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తిరిగి రావలసిందిగా పాకిస్తాన్‌లో నివసిస్తున్న భారత జాతీయులకు కేంద్రం సలహా ఇచ్చింది. హోమ్ శాఖ మంత్రి స్వయంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి గడువు తరువాత భారత్‌లో ఏ పాకిస్తానీ బస చేయకుండా చూడాలని వారిని కోరినట్లు ఆ వర్గాలు తెలియజేశాయి. తమ తమ ప్రాంతాల్లో ఉంటున్న పాకిస్తానీ జాతీయులను గుర్తించి, వారిని తిప్పి పంపేలా చూడాలని కూడ ముఖ్యమంత్రులను కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. వీసాల రద్దు ఆదేశం హిందు పాకిస్తానీ జాతీయులకు ఇదివరకే జారీ చేసిన దీర్ఘ కాలిక వీసాలకు వర్తించదు. అవి 'చెల్లుబాటులో ఉంటాయి.' పహల్‌గామ్ దాడికి సీమాంతర సంబంధాలు ఉండడంపై పాకిస్తానీ జాతీయులకు వీసా సర్వీసులను వెంటనే నిలుపుదల చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. 26/11 ముంబయి ఉగ్ర దాడి దరిమిలా దేశంలో పౌరులను లక్ష్యంగా చేసుకున్న హీనమైన ఉగ్ర దాడి అది. అదనంగా సార్క్ వీసా పొడి గింపు పథకం (ఎస్‌విఇఎస్) కింద భారత్‌కు ప్రయా ణించేందుకు పాకిస్తానీ జాతీయులను అనుమతించ బోమని, ఎస్‌విఇఎస్ వీసా కింద ప్రస్తుతం భారత్‌లో ఉన్న పాకిస్తానీ జాతీయుడు ఎవరైనా 48 గంటల్లోగా దేశం వదలి వెళ్లాలని కూడా ప్రభుత్వం బుధవారం ప్రకటిం చింది. ఆ గడువు శుక్రవారంతో ముగిసింది. పహల్‌గామ్ మారణకాండలో పాత్ర ఉన్న ప్రతి ఉగ్రవాదిని, వారి 'మద్ద తుదారులను' భారత్ 'గుర్తించి, ఆచూకీ తీసి, శిక్షిస్తుంది' అని, హంతకులను 'భూమి చివరి వరకు ' వెంటాడు తుందని ప్రధాని నరేంద్ర మోడీ గురువారం విస్పష్టంగా ప్రకటించారు. మరొక వైపు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా దౌత్యపరంగా దాడిని భారత్ ముమ్మరం చేసింది. గురు వారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో పార్టీలతో సంబంధం లేకుండా నాయకులు అందరూ ఉగ్రవాదం పైన, ఉగ్ర శిబిరాలపైన కఠిన చర్య తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు హామీ ఇచ్చారు. భారత్ అదే సమయంలో 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని వెంటనే నిలిపివేస్తున్నట్లు కూడా పాకిస్తాన్‌కు తెలియజేసింది. ఒప్పందం షరతులను పాక్ ఉల్లంఘించిందని భారత్ ఆరోపించింది.

## పహల్గాం దాడి వెనుక 'లష్కర్ ఎ తోయిబా' చీఫ్ హాఫీజ్ సయీద్ హస్తం

న్యూ డిల్లీ ఏప్రిల్ 25: మూడు రోజుల క్రితం జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం సమీపంలోగల బైసరన్ లోయలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన దాడి యావత్ భారతదేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏకంగా 26 మందిని పొట్టనపెట్టుకున్న ఆ దాడిని ప్రత్యక్షంగా చూసిన బాధితులు ఇంకా షాక్ నుంచి తేరుకోలేకపోతున్నారు. అయితే ఈ క్రూరమైన దాడి వెనుక 'లష్కర్ ఎ తోయిబా' చీఫ్ హాఫీజ్ సయీద్ హస్తం ఉన్నట్టు తెలుస్తోంది.



2వ పేజీలో


# అమెరికా కోసమే దశాబ్దాలుగా ఈ దరిద్రపు పని

## పాక్ రక్షణ మంత్రి ఒప్పుకోలు


## ఉగ్రవాదులకు పాక్ నిధులు, శిక్షణ ఇచ్చింది

### ఈ తప్పిదం పాక్‌కు చేటు తెచ్చిందన్న మంత్రి ఖ్వాజా ఆసిఫ్

లండన్ ఏప్రిల్ 25: పాశ్చాత్య దేశాల కోసం తమ దేశం ఉగ్రవాదుల సంస్థలకు దన్నుగా నిలుస్తున్నదని. శిక్షణ ఇస్తున్నదని, నిధులు సమకూరుస్తున్నదని పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ అంగీకరించారు. ఈ తప్పిదం పాకిస్తాన్‌కు చేటు తెచ్చిందని ఆయన చెప్పారు. పహల్‌గామ్‌ల ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్తాన్ స్పందన, ఉగ్రవాదంపై వైఖరి గురించి స్కై న్యూస్‌కు ఇంటర్వ్యూలో పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఆసిఫ్‌ను న్యూస్ ప్రెజెంటర్ యాల్డా హకీమ్ ప్రశ్నించారు. ఇటీవల పహల్‌గామ్‌లో ఉగ్ర దాడిలో 26 మంది వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. 'సార్, ఈ ఉగ్ర సంస్థలను సమర్థిస్తున్న, శిక్షణ, నిధులు ఇస్తున్న సుదీర్ఘ చరిత్ర పాకిస్తాన్‌కు ఉందని అంగీకరిస్తారా' అని హకీమ్ అడిగారు. 'నిజమే. మూడు దశాబ్దాలుగా యునైటెడ్ స్టేట్స్, బ్రిటన్‌తో సహా పాశ్చాత్య దేశాల కోసం మేము ఈ దరిద్రపు పని సాగిస్తున్నాం' అని ఆసిఫ్ సమాధానం ఇచ్చారు. 'అది పొరపాటే. దాని వల్ల మేము నష్టపోయాం. అందుకు మీరు నాతో ఇలా అంటున్నారు. మేము సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా, ఇంకా 9/11 తరువాత యుద్ధంలో మేము చేరి ఉండకపోతే, పాకిస్తాన్‌దీ తిరుగులేని ట్రాక్ రికార్డు' అని ఆయన అన్నారు. 'ఈ ప్రాంతంలో ఏమి సంభవించినా పాకిస్తాన్‌ను నిందించడం అగ్ర రాజ్యాలకు ఎంతో సౌకర్యంగా ఉంటున్నది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా 19810 దశకంలో వారి పక్షాల పోరాడినప్పుడు, ఈనాటి ఈ ఉగ్రవాదులు వాషింగ్టన్‌లో విందు చేశారు. ఆతరువాత 9/11 దాడులు జరిగాయి. మళ్లీ అదే పరిస్థితి వచ్చింది. అప్పట్లో మా ప్రభుత్వం పొరపాటు చేసిందని నా భావన' అని ఆయన తెలిపారు. ఆ సమయంలో పాకిస్తాన్‌ను 'పావుగా ఉపయోగించుకున్నారు' అని ఆసిఫ్ అన్నారు. పహల్‌గామ్‌లో మంగళవారం నాటి ఉగ్ర వాడికి, దాడికి తన బాధ్యత ఒప్పుకున్న నిషిద్ధ లష్కరె తయ్యిబా (ఎల్‌ఇటి) అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్‌ఎఫ్)కు పాకిస్తాన్‌ను నిందిస్తుండడం గురించి మంత్రిని ప్రశ్నించారు. 'పాకిస్తాన్‌లో లష్కరె తయ్యిబా ఇక ఎంత మాత్రం ఉనికిలో లేదు. అది అంతరించింది. మాతృ సంస్థ ఉనికిలో లేనప్పుడు అనుబంధ సంస్థ ఇక్కడ ఎలా ఊపిరి పోసుకుంటుంది' అని ఆసిఫ్ అన్నారు. పహల్‌గామ్ ఉగ్ర దాడి ఫలితంగా పరిస్థితులు విషమిస్తాయని పాకిస్తాన్ భయపడుతోందా అని ప్రశ్నించినప్పుడు సముచిత రీతలో స్పందించేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని మంత్రి ఆసిఫ్ సమాధానం ఇచ్చారు.



## ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్ కన్నుమూత



**బెంగళూరు ఏప్రిల్ 25:** ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్(84) కన్ను మూశారు. బెంగళూరులోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు కృష్ణస్వామి కస్తూరి రంగన్. కేరళలోని ఎర్నాకులంలో ఆయన జన్మించారు. ముంబై యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసిన రంగన్.. అహ్మదాబాద్ ఫిజికల్ రీసెర్చ్ లాబోరేటరీ నుంచి 1971లో డాక్టరేట్ అందుకున్నారు.990 నుంచి 1994 వరకూ ఆయన యూఆర్‌ఎసి డైరెక్టర్‌గా పని చేశారు. 1994 నుంచి 2003 వరకూ తొమ్మిదేళ్ల పాటు భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఛైర్మన్‌గా సేవలు అందించారు. జెఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 2003–2009 వరకూ ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. దీంతో పాటు మోదీ సర్కార్ తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా రంగన్ పని చేశారు.ఇస్రో శాస్త్రవేత్త నంబీ నారాయణన్ మీద దేశద్రోహం ఆరోపణలు వచ్చినప్పుడు ఇస్రో ఛైర్మన్‌గా ఉంది కస్తూరి రంగనే. 1969లో ఆయన లక్ష్మిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం.

## కేటీ రామారావుకు ఫుల్ పవర్స్



**హైదరాబాద్, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఎన్నికల్లో ఆయనే అంతా డిసైడ్ చేసేటట్లున్నారు. కేసీఆర్ పార్టీ అధినేతగా ఉన్నప్పటికీ ఆయన గౌరవం ఆయనకు ఉంటుంది. ఆయన సలహాలు, సూచనలు మాత్రమే తీసుకుంటారు. కేసీఆర్ చెప్పే వ్యూహాలను రాజకీయంగా అమలు చేయనున్నారు. అంతే తప్ప నియోజక వర్గాల్లో కేసీఆర్ జోక్యం మాత్రం ఇక ఉండక పోవచ్చని అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. కేసీఆర్ రాజకీయంగా యాక్టివ్‌గా ఉండకపోవచ్చన్న ఊహాగానాలు గులాబీపార్టీలో జోరుగా ఊపందు కుంటున్నాయి. అదే సమయంలో కేటీఆర్‌ను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు కూడా క్యూ కడుతున్నారు. వచ్చే ఎన్నికలకు ముందు అంటే రానున్న ఏడాది తాను తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ వచ్చే ఏడాది పాదయాత్ర చేసిన తర్వాత కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఇప్పటికే అక్టోబరు నెలలో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని కూడా కేటీఆర్ – 2వ పేజీలో

## కాళేశ్వరం నిరుపయోగమైనా.. రికార్డుస్థాయిలో పంటలు వచ్చాయి

### నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**హైదరాబాద్ ఏప్రిల్ 25:** ప్రాజెక్టుల అంశంలో బిఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలి అని నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కాళేశ్వరంతో అద్భుతం సృష్టిస్తున్నామని రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని మండిపడ్డారు. ఎన్‌డిఎస్‌ఎ నివేదిక చూసిన తర్వాతైనా సిగ్గుపడాలి అని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నేతలే డిజైన్ చేశారని వాళ్లే నిర్మించారని ఆరోపించారు. మేడిగడ్డ, సుందిళ్ల నిరుపయోగంగా మారాయని అన్నారు. కాళేశ్వరం నిరుపయోగమైనా.. రికార్డుస్థాయిలో పంటలు వచ్చాయని తెలిపారు.అబద్ధాలను గొప్పగా చెప్పుకొని బతకాలని బిఆర్ఎస్ అనుకుంటోందని.. రైతులకు బిఆర్ఎస్ నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై అధ్యయనం చేస్తామని.. వచ్చే కేబినెట్ భేటీలో ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కాళేశ్వరాన్ని.. బిఆర్ఎస్ నేతల జేబులు నింపుకోవడానికే కట్టారని ఆరోపించారు.

# ఉగ్రవాదంపై భారత్ సమైక్య పోరు సాగించాలి: రాహుల్ గాంధీ



**శ్రీనగర్ ఏప్రిల్ 25:** పహల్‌గామ్ ఉగ్ర దాడి వెనుక వ్యూహం దేశ ప్రజలను చీల్చడం అని, ఉగ్రవాదాన్ని శాశ్వతంగా ఓడించేందుకు భారత్ సంఘటితంగా నిలవడం తప్పనిసరి అని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఉద్ఘాటించారు. 'అది దుర్భర విషాదం. ఏమి జరుగుతోందో తెలుసుకుని, సాయం చేయడానికి ఇక్కడికి వచ్చాను. జమ్మూ కాశ్మీర్ ప్రజలు అందరూ ఈ భీకర దాడిని ఖండించారు. వారు దేశానికి పూర్తి మద్దతు ప్రకటించారు' అని రాహుల్ శ్రీనగర్‌లో విలేకరులతో చెప్పారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ చేరుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ క్షతగాత్రుల గురించి వాకబు చేయడానికి బాదామిబాఘ్ కంటోన్మెంట్‌లో ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని సందర్శించారు. 'క్షతగాత్రుల్లో ఒకరిని పరామర్శించాను. తక్కినవారు వెనుకకు వెళ్లిపోయినందున వారిని కలుసుకోలేకపోయాను. కుటుంబ సభ్యులను కోల్పోయిన ప్రతి ఒక్కరికీ నా సానుభూతి. దేశం సంఘటితంగా నిలుస్తున్నదని ప్రతి ఒక్కరికీ తెలియాలని అనుకుంటున్నా' అని రాహుల్ చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, మొత్తం ప్రతిపక్షాలు ఉగ్ర దాడిని ఖండించాయని, ప్రభుత్వానికి దన్నుగా ఉన్నాయని తెలిపారు. రాహుల్ జెకె లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కూడా కలుసుకున్నారు. పహల్‌గామ్‌లో పరిణామాల గురించి ఆయనకు వారిద్దరు వివరించారు. 'మా పార్టీ వారికి మద్దతు ఇవ్వబోతున్నదని వారిద్దరికీ హామీ ఇచ్చాను' అని రాహుల్ తెలియజేశారు. రాహుల్ అంతకుముందు వర్తకుల ప్రతినిధివర్గాన్ని, విద్యార్థుల నాయకులను, పర్యాటక రంగానికి సంబంధించినవారిని కలుసుకున్నారు.

# పహల్గాం దాడి వెనుక 'లష్కర్ ఎ తోయిబా' చీఫ్ హాఫీజ్ సయీద్ హస్తం

(మొదటి పేజీ తరువాయి)

హాఫీజ్ సయీద్‌తోపాటు అతడి ముఖ్య అనుచరుడు సైఫుల్లా ఉగ్రవాదులను అమాయకుల మీద ఊసిగొల్పారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. లష్కర్ ఎ తోయిబాకు అనుబంధంగా ఉండే కరుడుగట్టిన ఉగ్రవాదుల బృందం మంగళవారం బైసరన్‌లో నిర్దాక్షిణ్యంగా 26 మంది అమాయకులను మట్టుపెట్టింది. నిఘా వర్గాల సమాచారం ప్రకారం ఆ బృందంలో ప్రధానంగా విదేశీ ఉగ్రవాదులు ఉంటారు. ఆ ఉగ్రవాదులకు స్థానిక ఉగ్రవాదులతోపాటు కశ్మీర్‌లో మద్దతుదారులు కొందరు సహకరించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్ ప్రభుత్వ మద్దతుతో హాఫీజ్ సయీద్, అతడి ముఖ్య అనుచరులు ఈ ఉగ్రమూకలకు నేరుగా సాయపడి ఉండవచ్చని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముంబైలో 26/11 దాడికి కారకుడైన హాఫీజ్ సయీద్ ఈ దాడిలో పాల్గొన్న టెరరిస్టులకు కూడా అన్ని రకాలుగా సహాయసహకారాలు అందించి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉగ్రదాడికి పాల్పడిన బృందం చాలాకాలంగా కశ్మీర్ లోయలో క్రియాశీలకంగా ఉన్నట్టు నిఘా వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది సోనామార్గ్, బూతాపత్రీ, గండేర్బల్ దాడుల్లో ఈ బృందమే పాలుపంచుకున్నట్లు తెలిసింది. గత అక్టోబర్‌లో బూతాపత్రిలో జరిగిన దాడిలో ఇద్దరు ఆర్మీ జవాన్లు సహా మొత్తం నలుగురు మృతి చెందారు. అదే నెలలో సోనామార్గ్ టెన్నెల్ కార్మికులను టార్గెట్ చేస్తూ జరిగిన దాడిలో ఆరుగురు కార్మికులతో పాటు ఓ డాక్టర్ మరణించారు. అయితే, గత డిసెంబర్‌లో ఈ టెరరిస్టు బృందానికి చెందిన జునైద్ అహ్మద్ భట్ అనే లష్కర్ ఎ తోయిబా ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. మిగిలిన వారు ఎలాగోలా తప్పించుకుని సమీప అడవుల్లోకి పారిపోయారు. కాగా భారీ దాడి చేసిన తర్వాత ఈ ఉగ్రమూకలు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోతాయని నిఘా వర్గాలు చెబుతున్నాయి. పాకిస్థానీ హ్యాండర్ల నుంచి తదుపరి ఆదేశాలు అందేవరకు అక్కడి అడవుల్లోనే తలదాచుకుంటారని తెలుపుతున్నాయి. వీరికి పాక్ మిలిటరీతోపాటు ఐఎస్ఐ నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అంది ఉండొచ్చని అనుమానిస్తున్నాయి.

**దాడి జరిగిందిలా..:** బైసరన్ లోయలో మూడు ప్రదేశాలను టార్గెట్ చేసుకున్న ఉగ్రమూకలు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. పోలీసుల కథనాల ప్రకారం ఓ ప్రాంతంలో ఐదు మందిని, మరో మైదాన ప్రాంతంలో ఇద్దరిని, లోయ సరిహద్దు వద్ద మిగతా 19 మందిని ఉగ్రవాదులు బలితీసుకున్నారు. ఫెన్సింగ్ దాటి పారిపోగలిగిన వారు ఈ దాడి నుంచి తప్పించుకోగలిగారు.

# వాహనాలకు హారన్లుగా భారతీయ సంగీత శబ్దాలు మాత్రమే వచ్చేలా పరికరాలు

### కేంద్ర రోడ్డు, రవాణా శాఖల మంత్రి నితిన్ గడ్కరీ ఓ సరికొత్త ప్రతిపాదన.. త్వరలో చట్టం తేవాలని యోచన



**న్యూ డిల్లీ ఏప్రిల్ 25:** కేంద్ర రోడ్డు, రవాణా శాఖల మంత్రి నితిన్ గడ్కరీ ఓ సరికొత్త ప్రతిపాదన చేశారు. వాహనాలకు హారన్లు గా భారతీయ సంగీత పరికరాల శబ్దాలు మాత్రమే వచ్చేలా త్వరలో చట్టం తేవాలని యోచిస్తున్నట్లు చెప్పారు. నవభారత్ టైమ్స్ 78వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గడ్కరీ ప్రసంగించారు. అన్ని వాహనాలకు హారన్లుగా భారతీయ సంగీత పరికరాలు ఉత్పత్తి చేసే శబ్దాలనే వినియోగించేలా చట్టం తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఫ్లూట్, తబలా, వయెలిన్, హార్మోనియం వంటి వాయిద్య పరికరాల ద్వారా వచ్చే శబ్దాలు ఇందులో ఉంటాయని చెప్పారు. ఆయా ధ్వనులు వినడానికి ఎంతో హాయిగా ఉంటుందని తెలిపారు. ఇదే కార్యక్రమంలో వాయుకాలుష్యంపై కూడా నితిన్ గడ్కరీ మాట్లాడారు. దేశంలో మొత్తం వాయు కాలుష్యం రవాణా రంగం వాటా 40 శాతం వరకు ఉంటుందని చెప్పారు. దీన్ని ఎదుర్కొనేందుకు మోదీ ప్రభుత్వం మిథనాల్, ఇథనాన్‌తో నడిచే వాహనాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఇక భారత్‌లో ఆటోమొబైల్ పరిశ్రమ బలాన్ని కూడా గడ్కరీ హైలెట్ చేశారు. కార్లు, ద్విచక్ర వాహనాల ఎగుమతి ద్వారా దేశం గణనీయమైన ఆదాయాన్ని అర్జిస్తున్నట్లు చెప్పారు. 2014లో భారత ఆటోమొబైల్ రంగం విలువ రూ.14 లక్షల కోట్లు కాగా, ఇప్పుడు అది రూ.22 లక్షల కోట్లకు పెరిగినట్లు చెప్పారు. మన ఆటోమొబైల్ మార్కెట్ జపాన్‌ను అధిగమించి అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో నిలిచిందన్నారు



# ఉగ్రదాడిపై ప్రతీకారం ..

## భారత్ ముందు నాలుగు మిలిటరీ ఆప్షన్‌లు

**న్యూ డిల్లీ ఏప్రిల్ 25:** మూడు రోజుల క్రితం పహల్గాం లో జరిగిన ఉగ్రదాడి తో భారత్ ఉలిక్కిపడింది. ఈ దాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ప్రతీకారంతో రగిలిపోతోంది. ఈ క్రూరమైన దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది. భవిష్యత్తులో ఆర్థికంగా కోలుకోకుండా చేసేందుకు సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపేసింది. ఇక పహల్గాంలో నరమేధం సృష్టించిన ఉగ్రవాదులను వదిలిపెట్టకూడదని, వాళ్లకు ధీటైన జవాబు ఇవ్వాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎలా ప్రతీకారం తీర్చుకొంటారన్నది చర్చనీయాంశంగా మారింది. భారత ప్రభుత్వం మాత్రం సైనిక చర్య అంశంపై గుంభనంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి అడుగు వేయబోతుందనే విషయంలో నిపుణులు తమతమ అంచనాలను వెల్లడిస్తున్నారు. మొత్తానికి భారత్ ఎదుట నాలుగు మిలిటరీ ఆప్షన్లు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ నాలుగు ఆప్షన్‌లు ఏమిటో ఇప్పుడు చూద్దాం..

**రఫేల్, మిరాజ్‌లను రంగంలోకి దింపడం..**

ప్రస్తుతం వాయుసేనలో అత్యాధునిక ఫైటర్ జెట్లు అయిన రఫేల్, మిరాజ్ విమానాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించి పాకిస్థాన్‌లోని కీలక స్థావరాలపై దాడులు చేయడం ఇండియన్ మిలిటరీ ముందున్న మొదటి ఆప్షన్. అదే సమయంలో బాలాకోట్‌పై దాడి అనంతర అనుభవాలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యర్థుల రక్షణ వలయాన్ని ఛేదించే సామర్థ్యాలు రఫేల్, మిరాజ్‌లకు ఉన్నాయి. అయితే ఈ ఆప్షన్‌ను ఎంచుకుంటే అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి.

**లైన్ ఆఫ్ కంట్రోల్‌ను దాటి..**

సిమ్లా ఒప్పందాన్ని పక్కన పెడతామని తాజాగా పాకిస్థాన్ బెదిరించింది. ఆ ప్రకారం చూస్తే ఆ దేశం నియంత్రణ రేఖను గుర్తించనట్లు అవుతుంది. దాంతో భారత్‌కు దూకుడుగా ఆపరేషన్లు చేపట్టే అవకాశం లభిస్తుంది. ఇటీవల ఎల్‌వోసీ వద్ద పాకిస్థాన్ జరిపిన ఉల్లంఘనలను భారత్ కారణంగా చూపవచ్చు. ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఆపరేషన్లు చేపట్టవచ్చు. ఇది భారత్ ముందున్న మరో ఆప్షన్‌గా చెప్పవచ్చు. కాకపోతే అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితులు భారత దళాలకు సవాల్‌గా మారుతాయి. ఆపరేషన్లకు సుదీర్ఘ సమయం పట్టడం, ఇప్పటికే పలు బలమైన పొజిషన్లలో పాకిస్థాన్ దళాలు ఉండటం ప్రతికూలంగా మారవచ్చు.

**భారీ టార్గెట్స్‌పై సర్జికల్ స్ట్రైక్స్..**

భారీ టార్గెట్లను గుర్తించి సర్జికల్ స్ట్రైక్స్ చేయడం భారత్ ముందున్న మూడో ఆప్షన్. కాకపోతే ఇప్పుడు పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండటంతో సర్జికల్ స్ట్రైక్స్ అంత సులువు కాకపోవచ్చు. సక్సెస్‌ఫుల్‌గా సర్జికల్ స్ట్రైక్స్ చేయాలంటే రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్, శక్తిమంతమైన దళాలు, కచ్చితమైన ప్లానింగ్ అవసరం.


**శతఘ్నులు, స్నైపర్లతో కాల్పులు..**

ఇక లక్ష్యాలపై గురిపెట్టి భారీ శతఘ్నులు, స్నైపర్ గన్స్‌తో కాల్పులు జరపడం భారత్ ముందున్న నాలుగో ఆప్షన్‌గా చెప్పవచ్చు. వీటితోపాటు భారీ మోర్టార్లను కూడా వాడవచ్చు. దాంతో ఉద్రిక్తతలకు అవకాశం తక్కువగా ఉంటుంది. నియంత్రణ రేఖ సమీపంలోని శత్రుస్థావరాలు, సరఫరాల మార్గాలు, ఔట్‌పోస్టులను తుడిచిపెట్టవచ్చు. కాకపోతే ఈ దాడులతో ఫలితం పెద్దగా ఉండదు. భారీ దాడులతోనే భారీ ఫలితం దక్కుతుంది.

## మంత్రి వర్గం

# వాయిదాల పర్వంతోనే సరి..


**హైదరాబాద్, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే):** ఇదిగో.. అదిగో.. అన్నారు. కొందరైతే డేట్ కూడా ఫిక్స్ చేశారు. తీరా చూస్తే ఏదీ లేదు. వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ఎప్పుడనేది.. అసలు అంతుచిక్కని ప్రశ్నగా మారిపోయింది. అయితే ఇప్పుడు మీనాక్షి నటరాజన్ కామెంట్స్‌తో మరోసారి కేబినెట్ అంశం తెరపైకొచ్చింది. మంత్రివర్గ విస్తరణ ఎవరి పరిధిలో ఉంటుందన్న టాపిక్‌పై తెలంగాణలో హాట్‌హాట్ డిబేట్స్ నడుస్తున్నాయిమంత్రివర్గ విస్తరణ కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూపులు.. అంతకంతకూ పెరిగిపోయిన ఆశావహులు.. కాలం గడిచిపోతున్నా పదవీ కాంక్ష నెరవేరని నాయకుల ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పట్లో కేబినెట్ విస్తరణ కష్టమేనన్న సంకేతాలతో కొన్నాళ్లుగా నేతలంతా సైలెంట్ అయిపోయారు. అయితే లేటెస్ట్‌గా మంత్రివర్గ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త చర్చకు తెరలేపాయి. కేబినెట్ విస్తరణ అంశం ముఖ్యమంత్రి పరిధిలో ఉందంటూ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. ఈ కామెంట్సే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. మొన్నటిదాకా కేబినెట్ విస్తరణ అంశం కాంగ్రెస్ హైకమాండ్ చేతిలో ఉంటుందని చెబుతూ వచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులనే మంత్రిపదవి వరిస్తుందని.. ఆ నేతలు ఎవరనేది మాత్రం నిర్ణయించేది అధిష్టానమే పదేపదే చెప్పారు రేవంత్‌రెడ్డి. దీంతో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల కోసం ఎంతోమంది సీనియర్లు అధిష్టానం పెద్దలను కలవడం, లేఖలు రాయడం జరిగింది. సీనియర్ నేత జానారెడ్డి కూడా హైకమాండ్‌కు లెటర్ రాశారు. రంగారెడ్డి జిల్లాకు ఛాన్సివ్వాలని ఖర్గేకు, కేసీ వేణుగోపాల్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి



చేశారు. ఇక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అయితే ఓ అడుగు ముందుకేసి.. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే రాజీనామా చేస్తానంటూ పార్టీ పెద్దలకే అల్టిమేటం ఇచ్చారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టారన్న ప్రచారం జరిగింది. ఇటు నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్ జరిపినట్లు జోరుగా ప్రచారం నడిచింది. ఇలా ఒక్కరేంటి మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలన్న తపనతో ఎందరో నేతలు హస్తినబాట పట్టారు. మరికొందరు విజ్ఞప్తి లేఖలు ఢిల్లీకి పంపారు. మొత్తంగా కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ ఒకలా.. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మరోలా మాట్లాడటంతో నేతలంతా కన్‌ఫ్యూజన్‌లో పడ్డట్లు తెలుస్తోంది. మరీ ఈ కేబినెట్ విస్తరణ కన్‌ఫ్యూజన్‌పై క్లారిటీ రావాలంటే కాస్త ఆగాల్సిందే..!

# మే రాకుండానే మండుతున్న సూరీడు

**అదిలాబాద్, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత వారం రోజులుగా ఎండ తీవ్రత పెరిగిపోయింది. నిప్పుల కొలిమిలా మారిపోయింది. బుధవారం గరిష్టంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జిల్లాలో ఉదయం నుంచే భానుడు. భగభగలా మండిపోతున్నాడు. దీంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మూడు రోజులుగా అన్ని మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో అధికారులు ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పెళ్లిళ్లు, శుభకార్యాలకు వెళ్లేందుకు కూడా జనాలు జంకుతున్నారు. దాహం తీర్చుకునేందుకు చల్లని శీతల పానీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొంత మంది వడదెబ్బకు గురై ఆసుపత్రుల పాలవుతున్న సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ లోని పలు ప్రాంతాలో ఐదు మంది వడ దెబ్బతో మృతి చెందినట్లు తెలిసింది. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను విపరీతంగా వాడుతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తల ను పాటిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఇంట్లోంచి బయటకు రావడం లేదు. ఏప్రిల్ నెలలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఉంది. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. రానున్న మే మాసంలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళనలో జనాలు ఉన్నారు. రోహిణి కార్తె నాటికి పరిస్థితి మరింత మారిపోయే అవకాశం ఉంది.



**ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి..**

వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. తలనొప్పి, వికారం, కళ్లు తిరగడం, వాంతులు చేసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదిచాలని హెచ్చరిస్తున్నారు. ప్రతీరోజూ 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలని, శీతల పానీయాలకు బదులు మజ్జిగ, నిమ్మ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయకూడదని సూచిస్తున్నారు.

# కేటీ రామారావుకు ఫుల్ పవర్స్

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఇక తాజాగా కేటీఆర్ రాజేంద్ర నగర్ ఉప ఎన్నికల్లో పటోళ్ల కార్తీక్ రెడ్డి పేరును ప్రకటించడం కూడా ఈ చర్చకు కారణమయింది. ఏ మాత్రం కేసీఆర్ తో సంబంధం లేకుండా ముందుగానే, ఉప ఎన్నికల ఊసే లేకముందే అభ్యర్థిని ప్రకటించడంతో ఇంకా కారు స్టీరింగ్ కేటీఆర్ చేతుల్లోనే ఉన్నట్లు స్పష్టమయింది. కేసీఆర్ కూడా తొలి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక పెద్దగా ఆయన రాష్ట్రం కోసం పనిచేయాలన్న ఆకాంక్ష కూడా లేదు. దీంతో పాటు ఎక్కువ కాలం ఫామ్ హౌస్ లోనే పరిమితమవుతున్నారు. వ్యవసాయంలోనే ఆయన ఎక్కువ గడుపుతూ చాలా వరకూ సేద తీరుతున్నారు. వ్యవసాయ క్షేత్రం అంటే ఆయనకు మక్కువ. రాజకీయంలో అంచులన్నీచూశారు. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ కు మిగిలిన రాజకీయ నేతలకు మాదిరిగా పెద్ద లక్ష్యాలు ఏవీ ఉండవు. కానీ తాను స్థాపించిన పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకు వస్తే చాలునన్న భావనలో ఉన్నారు. అందుకే ఈసారి ఎన్నికలలో కేటీఆర్ క్రియాశీలకంగా మారనున్నారు. టికెట్లను కూడా ఆయనే కేటాయించనున్నారు. ఇది ఫైనల్ అంటూ గులాబీ పార్టీలే అభిప్రాయపడుతున్నాయి.

# హైడ్రా కొత్త లోగో రెడీ

**హైదరాబాద్, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే):** హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ, ప్రకృతి విపత్తుల నిర్వహణకు ఏర్పాటు చేసిన హైడ్రా ఇకపై కొత్త లోగోతో కార్యకలాపాలను కొనసాగించనుంది. ఇప్పటి వరకూ ఈవీడీఎం లోగోతోనే పనిచేసిన హైడ్రా లోగో మార్చింది. హైదరాబాద్ నగరాన్ని సూచించేలా హెచ్ అక్షరంపై నీటి బొట్టు ఉన్న లోగోను రూపొందించారు. చెరవులను కాపాడుకుంటూ, జల సంరక్షణ చేపడుతూ హైదరాబాద్ ను విపత్తుల నుంచి రక్షించుకుందామనే సూచకంగా కొత్త లోగోను తీర్చిదిద్దారు. కొత్త లోగోను హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారికంగా ఆమోదించారు. హైడ్రా కార్యకలాపాలు, సిబ్బంది యూనిఫామ్, వాహనాలపై నూతన లోగోను ముద్రించనున్నారు. హైడ్రా అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కొత్త లోగోను అప్డేట్ చేశారు.

**బతుకమ్మ కుంటలోనే బతుకమ్మ ఉత్సవాలు**

వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి బతుకమ్మ కుంటను సిద్ధం చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. బతుకమ్మ కుంటకు సంబంధించిన కోర్టు వివాదం మంగళవారం పరిష్కారమయ్యిందన్నారు. అంబర్ పేటలోని బతుకమ్మ కుంటను సందర్శించారు.

# దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి

ఖమ్మం , ఏప్రిల్ 25 ( వాయిస్ టుడే ): జమ్మూ కాశ్మీర్ లో ని పహల్గాం లో టూరిస్టుల పై ఉగ్రవాదులు దాడి చేసి చంపడం దారుణం చాలా బాధాకరమైన విషయం .

ఇలాంటి దారుణానికి కులం మతం తో ఎలాంటి సంబంధం లేదని, ఇలాంటి దుర్మార్గులను కఠినం గా శిక్షించాలి జమాతే ఇస్లామి హింద్ రామవరం మరియు రుద్రంపూర్ శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు.

చుంచు పల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీ లోని మస్జిద్ ఎ ఖుబా లో శుక్రవారం ప్రత్యేక నమాజ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖురాన్ లో అల్లాహ్ ఒక మనిషి ప్రాణాన్ని తీయడం యావత్ మానవాళి ప్రాణం తీసినట్లు అని, ఒక మనిషి ప్రాణం కాపాడితే యావత్ మానవాళి ప్రాణం కాపాడినట్లు అని హితబోధ చేశాడు.



హింస ద్వారా పేరు ధర్మాన్ని అణుచడం అత్యంత హేయమైన చర్య అని కూడా దైవం సెలవిచ్చాడు. "తన చేతల ద్వారా, చూపుల ద్వారా ఆలోచన ద్వారా ఎవరికైనా నష్టం కష్టం కలిగిస్తే మీరు విశ్వాసులే కాదు " ద్వేషించే వారిని ప్రేమించమని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారు. మంచి చెడు ఒకటి కాదు చెడును అతి శ్రేష్టమైన మంచి ద్వారా తొలగించు, నీ ప్రాణ శత్రువు సైతం నీ ప్రాణ స్నేహితులు అయిపోవడం మీరు గమనిస్తారు అని ఖురాన్ బోధిస్తుంది. అమాయకులను చంపమని ఇస్లాం ఏనాడూ ప్రోత్సాహించదని అన్నారు. ప్రతి మతం మంచిని మానవత్వాన్ని చాటి చెప్పుతుంది. ముక్కు పచ్చలారని నీవు వధువుతో పాటు అమాయకులైన వారిని పొట్టన పెట్టుకున్న దుర్మార్గులను కఠినం గా శిక్షించాలి. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మేరుగైన వైద్యం అందించాలి. స్వార్థ రాజకీయాలకు స్వస్తి పలికి కులమతాల మధ్య శాంతి సామరస్యం కోసం, కృషి చేయాలని ఉగ్రవాదానికి మతానికి ఎలాంటి సంబంధం ఉండదు. ఇలాంటి సంఘటనలను మానవతా వాదులందరు ఖండించాలి. అని కోరారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ఇమామ్, షబ్బీర్, రజాక్, సోను బాయ్, అజ్వర్, రఫీ, ఆలం, షమీం తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ జాతీయ పురస్కారానికి డాక్టర్ బాలు ఎంపిక

### తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాల నిర్వహణకు గాను



కామారెడ్డి వాయిస్ టుడే ఏప్రిల్ 25: వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ తెలుగు రాష్ట్రాల జాతీయ స్థాయి పురస్కారాలు -2025 కు ప్రకటించిన జాతీయ స్థాయి పురస్కారానికి కామారెడ్డి రక్తదాతల సమూహ వ్యవస్థాపకుడు,ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు ఎంపిక కావడం జరిగిందని ఆదివారం నాడు గోదావరిఖనిలో అందుకోవడం జరుగుతుంది. ఈ అవార్డుకు ఎంపిక చేసిన సంస్థ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది చిన్నారులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని వారి కోసం మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 2500 ల యూనిట్ల రక్తాన్ని సేకరించి అందజేయడం జరిగిందని ఈ సేవను గురించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకొని దేశంలోనే మొదటి సంస్థగా కామారెడ్డి రక్తదాతల సమూహం,ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ లు సంయుక్తంగా నిలవడం జరిగిందని అన్నారు. ఈ పురస్కారం ఆదుకోవడానికి సహకరించ రక్తదాతలకు మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇల్లందు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

### సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి




భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఏప్రిల్ 25: శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఇల్లందు పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన భాదితుల సమస్యలను తెలుసుకుని తక్షణమే విచారణ చేపట్టి న్యాయం చేకూరేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. బెట్టింగ్,గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తించే వ్యక్తులను గుర్తించి అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి చంద్రభాను,సిఐ సత్యనారాయణ,ఎస్సై శ్రీనివాసరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగ్రవాదులు కఠినంగా శిక్షించాలి

### మాజీమంత్రి ప్రభుత్వ సలాదరులు షబ్బీర్ అలీ



కామారెడ్డి వాయిస్ టుడే ఏప్రిల్ 25 : జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఈరోజు హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ముక్త కంఠంతో అందరూ ఈ దాడిని ఖండిస్తూ ఈరోజు శుక్రవారం రోజున చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబాలకు దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించాలన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహాల్గామ్ లోని పర్యటకుల బృందాన్ని లక్ష్యంగా చేసుకొని వారిపై జరిగిన భయంకరమైన ఉగ్రదాడిని కండిస్తున్నాం అని అన్నారు. ఇది అమానవీయ చర్య అని విచారం వ్యక్తం చేస్తూ.. ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని బహిరంగంగా కఠినాతి కఠినంగా శిక్షించాలని కలలో కూడా ఇలాంటి చర్యలు పాల్పడాలంటే వెన్నులో వణుకు పుట్టే విధంగా శిక్ష అమలు చేయాలన్నారు. కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడిని భారతదేశాన్ని మాత్రమే కాకుండా యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. ఈ దాడిలో చాలా మంది పర్యాటకులు చనిపోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదానికి మతం ఉండదని చిన్న చీమకు కూడా హాని తలపెట్ట వద్దని ఇస్లాం చెప్తుంది అన్నారు. ప్రభుత్వం ఉగ్రవాదంపై తీసుకునే ఎలాంటి చర్య అయినా సరే మా మద్దతు ఉంటుంది. మానవత్వం ఉన్నవారు ఎవరైనా సరే ఈ హేయమైన చర్యను ఖండించాల్సిందే అన్నారు.

## ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



కామారెడ్డి వాయిస్ టుడే ఏప్రిల్ 25: జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై దాడి చేసి 27 మందిని చంపిన ఉగ్రవాదుల చర్యలను సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని దేశ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లోని అల్గాం పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి వెళ్లిన 27 మంది పర్యాటకులను విచక్షణారహితంగా దాడి చేసి తుపాకులతో కాల్చి చంపిన ఉగ్రవాద చర్యలను దేశ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు ఇది ఇరికిపందల చర్యగా అభివర్ణించారు ఈ దాడిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉందని మరి కొంతమందికి తీవ్ర గాయాలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు భిన్నత్వంలో ఏకత్వం కలిగిన వసుదైక కుటుంబ భావన కలిగిన భారతదేశంలో ఇటువంటి విద్వేష విభజన రాజకీయాలను దేశం ఏనాటికి అంగీకరించదని అన్నారు పరస్పర సహకారం సహనంతో ప్రపంచ అభివృద్ధి జరుగుతుందే తప్ప ప్రజల ఆచారాలు సంప్రదాయాలు ఆహార అలవాట్లపై ద్వేషం పెంచుకోవడం వల్ల మనగోరేది ఏమీ లేదని అన్నారు పర్యాటకులపై జరిగిన ఉన్మాద చర్యలకు వ్యతిరేకంగా బాధిత కుటుంబాలకు అండగా దేశ ప్రజానీకం నిలబడాలని కోరారు కేంద్ర ప్రభుత్వం బాధ్యత కుటుంబాలకు అన్ని రకాలుగా సహాయం అందించాలని డిమాండ్ చేశారు దేశంలో ఆర్మీలో 2 లక్షలకు పైగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి దేశభద్రతకు ప్రతిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు ఇటువంటి చర్యలు పునారవృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు దేశ ప్రజలు ఐక్యతతో దృర్యాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కొత్త నరసింహులు. ముదాం అరుణ్ కుమార్. శ్రీనివాస్. సత్యం. తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భద్రత కల్పించేలా భూ భారతి చట్టం

### ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్

ఖమ్మం , ఏప్రిల్ -25 ( వాయిస్ టుడే) భూ హక్కులపై రైతులకు భద్రత కల్పించేలా భూ భారతి చట్టం రూపకల్పన చేశామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శనివారం వైరా మండల కేంద్రంలోని కామిశెట్టి కల్యాణ మండపంలో నిర్వహించిన తెలంగాణ భూ భారతి (భూమి హక్కుల) చట్టం- 2025 పై అవగాహన కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఆర్డీఓ నరసింహా రావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ రాజకీయాల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం ఇది కాదని, రైతాంగానికి భూ సమస్యల పరిష్కారం, భూ హక్కులు కల్పించే విధంగా భూ భారతి చట్టం రూపొందించామని అన్నారు.




భూ హక్కులపై రైతులకు ఉన్న అభద్రత తొలగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గత ప్రభుత్వం అనుభవదారు కాలం తొలగించి చిన్న రైతుల పొలాలను ఆసాములకు అప్పగించిందని, నేడు ఆ రికార్డులను భూ భారతి ద్వారా సరి చేస్తామని అన్నారు. గతంలో ఉన్న విఆర్ఓ వ్యవస్థ, అనుభవ దారు కాలం మళ్ళీ వస్తుందని, ఎప్పుడైనా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి పహాణి రాసి తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. భూ భారతి చట్టంపై ప్రజలు అందించిన సూచనలు కూడా తీసుకొని అవసరమైన మార్పులు తీసుకుని వస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి. నరసింహా రావు భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ భారతి చట్టం ద్వారా పక్కాగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూ హక్కుదారులకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం అధికారులు అందించిన ఆర్డర్ల పై సంతృప్తి చెందకుంటే అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. వారసత్వం, వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యుటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజుల లోగా మ్యుటేషన్ పూర్తి చేయకుంటే ఆటోమేటిక్ గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ కార్డు అందించడం జరుగుతుందని అన్నారు. పెండింగ్ సాదా బైనామాల పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మండల తహసీల్దార్ కే.వి. శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ సరస్వతి, వ్యవసాయ శాఖ అధికారిణి కరుణ శ్రీ, మునిసిపల్ కమీషనర్ వేణు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## డిసిఎంఎస్ కేంద్రాన్ని, రైస్ మిల్లును సందర్శించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం , ఏప్రిల్ 25 ( వాయిస్ టుడే ): నేలకొండపల్లి మండలంలో గల జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) కేంద్రాన్ని, రాజేశ్వరపురం లోని అరుణచల రైస్ మిల్లును శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. దాన్యం, కొనుగోలు, ట్రాన్స్‌పోర్ట్, కాంటాలు, బిల్లులు తదితర అంశాలపై రైతులతో మాట్లాడారు. మిల్లర్లతో మాట్లాడారు. రైతులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, మిల్లర్లకు, అధికారులకు సూచించారు. దాన్యం కొనుగోలు నుండి రైస్ మిల్లులకు తరలింపు వరకు కొనసాగుతున్న ప్రక్రియలో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ సంజీవ్, ఎస్సై సంతోష్ పాల్గొన్నారు.



## ఓరుగల్లు సభకు భారీగా తరలి రండి

### లింగాల కమల్ రాజ్

మధిర, ఏప్రిల్ 25 ( వాయిస్ టుడే ): మధిర నియోజక వర్గ పార్టీ కార్యాలయ పరిధి లో ముఖ్య నాయకులతో కలిసి సభకు ఆహ్వానించినమాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు. ఏప్రిల్ నెల 27వ తారీకు వరంగల్ ఎలకతుర్తి క్రాస్ రోడ్డు వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రజతోత్సవ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు గారి ఆధ్వర్యంలో మధిర నియోజక వర్గ పార్టీ కార్యాలయం లో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ హొదాల్లో ఉన్న BRS పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమలు.

### ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఖమ్మం బ్యూరో , ఏప్రిల్ -25 ( వాయిస్ టుడే): ఏప్రిల్ 27న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమలులో ఉంటుందని ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్ లలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఏప్రిల్ 27న నిర్వహిస్తున్న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పరీక్షల కేంద్రాల సమీపంలో గల ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాప్ లకు 200 మీటర్ల రేడియస్ లో సెక్షన్ 163 బి.ఎన్. ఎస్.ఎస్. యాక్ట్ అమలులో ఉంటుందని అన్నారు. ఏప్రిల్ 27న ఉదయం 8.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పరీక్షా కేంద్రాల సమీపంలో ఈ సెక్షన్ అమలులో ఉంటుందని, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడటానికి వీలు లేదని, ఎవరైనా ఈ ఆదేశాలను అతిక్రమిస్తే సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ కమీషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




## ఈ దూకుడుకు.. సాటెవ్వరూ.. పోలీస్ బాస్ దూకుడుతో ఖాకీల్లో కలవరం

కామారెడ్డి వాయిస్ టుడే ఏప్రిల్ 25 కామారెడ్డి : జిల్లా పోలీస్ బాస్ గా రాజేష్ చంద్ర బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి దూకుడుగా వ్యవహరిస్తున్నారు. నిత్యం ఎక్కడో ఓ చోట ఆకస్మిక తనిఖీలు చేస్తూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న హెూం గార్డు నుంచి ఎస్సైల వరకు సస్పెన్షన్లు చేస్తూ విధుల్లో అలసత్వం వహిస్తున్న వారి గుండెలను హడలెత్తిస్తున్నారు. ఇప్పటి వరకు జుక్కల్, తాడ్వాయి, రామారెడ్డి ఎస్సైలతో పాటు కానిస్టేబుల్, హెూం గార్డు లను సస్పెండ్ చేసి తన మార్కును చాటుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సూటిగానే మెసేజ్ ఇచ్చారు. పోలీస్ స్టేషన్ కు వివిధ కారణాలతో వచ్చే ఫిర్యాదు దారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఫిర్యాదులను స్వీకరించడంతో అలక్ష్యం చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెప్పినట్లుగానే చేస్తూ పోలీసుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నారు. విధి నిర్వహణలో ఎంతటి వారైనా సహించేది లేదంటూ అంటూ హెచ్చరికలు చేస్తూ దూసుకుపోతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆయన చేపడుతున్న చర్యలు సర్వత్రా ప్రశంసలు అందుకుంటున్నాయి. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ వ్యవస్థలో జరుగుతున్న తప్పిదాలు, అవినీతి, అక్రమాల విషయంలో మాత్రం ఎస్పీ రాజేష్ చంద్ర పోలీసు అధికారులను కూడా ఉపేక్షించడం లేదు. ఆయన బాధ్యతలు స్వీకరించిన పదిహేను రోజుల్లో ముగ్గురు ఎసైలతో పాటు ఇద్దరు సిబ్బంది పై వేటు వేశారు. జుక్కల్ ఎస్సై ను సస్పెన్షన్ చేసిన రెండు రోజులకే తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లును గురువారం రామారెడ్డి ఎస్సై నరేష్ ను సస్పెన్షన్ చేశారు. పదవ తరగతి పరీక్షల ప్రశ్నలు బయటకు లీక్ కాగా వాటిని ఎస్పీ సమర్థవంతంగా కట్టడి చేశారు. దారి తప్పిన పోలీసులను సక్రమ మార్గంలో నడిపేందుకు దేనికీ వెనుకాడడం లేదు. అలాగే సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని ప్రోత్సహిస్తూ వారికి రివార్డులు అందజేస్తూ తన చాటుకుంటున్నారు.



## ప్రభుత్వంతో సింగరేని కాలరీస్ అధికారుల అవగాహన ఒప్పందం

### కలెక్టర్‌ను కలిసిన సింగరేణి అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఏప్రిల్ 26: మణుగూరు సింగరేణి అధికారులు శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ని ఐడిఓసీలో కలిశారు.మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కట్టు వాగు మెట్ల వాగు, పూడిక తీత పనులు మణుగూరు మున్సిపాలిటీ అంతా కూడా వరద ప్రభావిత ప్రాంతానికి గురి కాకుండా కట్టుదిట్టమైనటువంటి ఏర్పాట్లు చేయడానికి కలెక్టర్ ని కలిసి ప్రభుత్వంతో 83.25.లక్షలు కు గాను ఎం ఓ యు చేసుకున్నారు.సింగరేణి కాలరీస్ వలన సంస్థ చుట్టుపక్కలలో ఉన్న గ్రామాలలో అందరికీ కూడా విద్య, వైద్య సహాయం ఉద్యోగ సౌకర్యాలు కల్పిస్తూ చెరువులు, కుంటలు, వ్యవసాయం మౌలిక వసతులు తదితర అనేక ఇటువంటి సదుపాయాలు ప్రజలకు కల్పిస్తున్నందుకు సింగరేణి అధికారులను కలెక్టర్ అభినందించారు.



## సిపిఐ 8వ మండల మహాసభలను విజయవంతం చేయండి

### సీపీఐ మండల కార్యదర్శి అదరి శ్రీనివాస్.

భీమదేవరపల్లి, ఏప్రిల్ 25,( వాయిస్ టుడే ప్రతినిధి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ఐదో తారీకు ముల్కనూర్ లో జరిగే సిపిఐ ఎనిమిదవ మండల మహాసభలు విజయవంతం చేయాలని శుక్రవారం రోజు ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో మహా సభల కరపత్రాన్ని విడుదల చేయడం జరిగినది మండలంలో జరిగే భూ పోరాటంలో పాల్గొన్న వారందరికీ అర్హులైన పేదలకు కింద పట్టాలు వచ్చి ఇందిరమ్మ ఇండ్లు అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆరు పథకాలను వెంటనే అమలు చేయాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు మంచాల రమాదేవి, కొంగల రామచంద్రారెడ్డి, ఆధరి రమేష్, సన్నీల రవి, మార్పు కృష్ణారెడ్డి, సుంచు కుమారస్వామి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ టిఆర్ఎస్ ఏ పార్టీ రజతోత్సవ వేదిక

### కాంగ్రెస్ పార్టీ నాయకుడు పచునూరి కర్ణాకర్ డిమాండ్



భీమదేవరపల్లి, ఏప్రిల్ 25,( వాయిస్ టుడే ప్రతినిధి): రజతోత్సవ సభ పేరుతో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయడానికి వస్తున్నది, బీఆర్ఎస్ ముఠా పట్ల జాగ్రత్తగా వుండాలి రజతోత్సవ ఉత్సవాలు ఎవరిని ఉద్ధరించడానికని, దళితుని ముఖ్యమంత్రిని చేసినందుకా? దళితులకు మూడు ఎకరాలు భూమి ఇచ్చినందుకా ? ఋణ మాఫీ చేసినందుకా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పై విషము కక్కడానికి తప్పా మీ దగ్గర మీ పార్టీ దగ్గర వున్న సబ్జెక్ట్ ఏంటి అని అడుగుతున్నాం టిఆర్ఎస్ పార్టీ నుండి బిఆర్ఎస్ మార్చి రెండు సంవత్సరాలకే రజతోత్సవ సభ ఏర్పాటు చేయడం కేసీఆర్.. బీఆర్ఎస్ మానసిక దౌర్భాగ్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేసీఅర్ నిజంగా నిజాయితీ ఉంటే తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రాణ త్యాగం చేసిన 1400 అమరుల కుటుంబాలకు కుటంబానికి రూ.25 లక్షల చొప్పున సభలో ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చునూరి కరుణాకర్ డిమాండ్ చేస్తున్నాను.




## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

కోదాడ ,ఏప్రిల్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని వాసవి క్లబ్ లు రీజియన్ 8,9 ల ఆధ్వర్యంలో కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడి లో మరణించిన వారికి నివాళులు. అనంతరం రంగ థియేటర్ నుండి స్థానిక గాంధీ సెంటర్ వరకు కొవ్వొత్తు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు సేకు శ్రీనివాస రావు,ఆర్ సి బెలిదె భరత్ కుమార్,పైడిమర్రి సతీష్ ఐ పి సి లు చల్లా విజయ శేఖర్, పబ్బ గీత , లోకేష్, డీపీసీ ఇమ్మడి సతీష్ బాబు, డి పి వో బండారు శ్రీనివాస రావు,గుండా ప్రవీణ్, జల్లా జనార్ధన్ రావు,పత్తి నరేందర్ వేంపటి ప్రసాద్,వంగవీటి నాగరాజు, సైదారావ్ యాదా కిరణ్, చిట్టిప్రోలు శ్రీమన్నారాయణ పలువురు వాసవియన్స్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆటో డ్రైవర్ల ఆర్థిక సహాయం



ఏప్రిల్ 25( వాయిస్ టుడే): నెమటూరు గ్రామానికి చెందిన చెల్లి కిష్టయ్య ఆటో డ్రైవర్ గా వృత్తిని కొనసాగిస్తూ గురువారం రోజున హార్ట్ ఎటాక్ వలన మరణించారు. ఆయన కుటుంబానికి కావేరి సీడ్స్ కంపెనీ పాములపర్తి మెయిన్ ప్లాంట్ హెచ్ఆర్ మేనేజర్ ,లేబర్ కాంట్రాక్టర్, తోటి ఆటో డ్రైవర్లు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు.

# ఫామ్ పాండ్స్ ద్వారా భూగర్భ జలాల అభివృద్ధితోపాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఏప్రిల్ 25: వ్యవసాయ భూముల్లో ఫామ్ పౌండ్స్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల అభివృద్ధితోపాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం చంద్రుగొండ పర్యటనలో భాగంగా స్థానికంగా ఉపాధి హామీ పథకం లో రైతు చేపల మడుగు తిరుపతి వ్యవసాయ క్షేత్రంలో 20/20 విస్తీర్ణంలో సుమారు రెండు లక్షల 25 వేల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తన వ్యవసాయ క్షేత్రంలో ఈ ఫామ్ పౌండ్ నిర్మాణాలు కచ్చితంగా చేపట్టాలని దీని ద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయి అన్నారు. ఈ ఫామ్ పాండ్ లద్వారా చేపల పెంపకం చేపట్టి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం పరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులు ఒక్క పంట పైనే ఆధారపడకుండా అంతర పంటగా చేపల పెంపకం, మునగ, అజోల్ల వంటివి సాగు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని అన్నారు.

అనంతరం కలెక్టర్ చేపలమడుగు నాగేంద్ర బాబు అనే రైతు ఉపాధి హామీ పథకం ద్వారా ఒక ఎకరంలో సాగు చేస్తున్న మునగ సాగును పరిశీలించి మునగ సాగు చేయడానికి ముందుకు వచ్చినందుకు రైతుని అభినందించారు . ఈ సందర్భంగా కలెక్టర్ రైతుకు మునగ సాగు లో తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు పద్ధతులు గురించి వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరం పొలంలో 1000 మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. మునగ మొక్కలు నిటారుగా పెరగడం ద్వారా గాలి దుమ్ము వంటి సమయాల్లో మొక్కలు విరిగిపోయే అవకాశం ఉందని కాబట్టి చిన్న ముక్కలుగా ఉన్నప్పుడే తలవిరుపు చేపట్టాలని రైతుకు సూచించారు. మునగ సాగు వలన వచ్చే లాభాలను గురించి వివరించారు. మునగాకు పౌడర్ ద్వారా లాభాలు ఆర్జించవచ్చని రైతులకు తెలిపారు.మునగ సాగు చాలా లాభసాటి మరియు పర్యావరణ అనుకూలమైన పంట అని అన్నారు.మునగ ఆకులు, కాయలు, విత్తనాలు, పూలు మరియు వేర్లు అన్నింటిలోనూ పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. ఇది చిన్న, సన్నకారు రైతులందరికీ ఒక మంచి ఆదాయ మార్గం, ఎందుకంటే దీనికి తక్కువ నీరు కూలీల అవసరం ఉంటుందని,అంతేకాకుండా, ఎరువులు, పురుగు మందులు కూడా ఎక్కువగా వాడాల్సిన అవసరం ఉండదు. తక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకుంటారు కాబట్టి , కాయలను సులభంగా, తకువ కాలంలోనే స్థానిక మారెట్లకు తరలించవచ్చు అని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట చంద్రుగొండ తాసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

హుజూర్నగర్ ఏప్రిల్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్నగర్ పట్టణంలోఇందిరా సెంటర్లో ముస్లిం మత పెద్ద జనాబ్ అబ్దుల్ రహీం మౌలానా మాట్లాడుతూ.. కాశ్మీర్ పహల్గావ్ లో మొన్న టూరిస్ట్ ల మీద జరిగిన ఉగ్ర దాడి కి నిరసన గా పట్టణంలోని ఉస్మానియా మసీద్ నుండి ఇందిరా సెంటర్ వరకు ప్లకార్డులు, బ్యానర్లు జాతీయ జెండాలు చేత పట్టుకొ భారీ నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది. భాదితుల ఆత్మకు శాంతి కలగాలని శుక్ర వారం ప్రార్థన అనంతరం మస్జిద్ వద్ద రెండు నిముషాల పాటు మౌనం పాటించడం జరిగింది.. పాకిస్తాన్ ఆర్మీ,ఐఎస్ఐ ప్రేరిత ఉగ్రవాదులు భారత దేశం లో మత సామరస్యాన్ని చెడ గొట్టే విధంగా మతం పేరు అడిగి మారణ హోమం సృష్టించడం వాళ్ళ నర రూప రాక్షసత్వం కి నిదర్శనం అని తెలిపారు. ముఖ్యంగా దేశ సరిహద్దు వద్ద పాక్ ఆక్రమిత కాశ్మీర్ నుండి ఉగ్ర వాదులు కాశ్మీర్ లోకి చొరబడి ఉగ్ర దాడి చేస్తారని ఇంటెలిజెన్స్ వర్గాలు ముందే చెప్పిన కేంద్ర ప్రభుత్వం పెడ చెవిన పెట్టిందని ఆయన తెలిపారు. కేంద్రం ప్రభుత్వం ఈ ఉగ్ర దాడి ఘటన కు బాధ్యులైన వారిని కఠినం గా శిక్షించాలని అలాగే మరణించిన బాధితులనుక్షేత్రగాతులకు, తక్షణ ఆర్థిక సాయంతో పాటు, ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఎండి. అజీజ్ పాషా,ఎండి నిజాముద్దీన్,అబ్దుల్ మజీద్ భాయ్, షేక్ మన్సూర్ అలీ,సయ్యద్ రఫీ, నవాబ్ జాని, లైటింగ్ జానీ,ఎస్డి మున్నా, హఫీజు రహమతుల్లా, రజవాలి బాబా,లతీఫ్,మజీద్,రహీం భాయ్, లతీఫ్, అశ్రఫ్ అలీ,యూసఫ్, జిలాని,ఇమ్రాన్,ముస్తఫా,మీరా, ఇబ్రహీం, సలావుద్దీన్, మొహీనుద్దిన్, బాబా,సిరాజ్,దస్తగిరి,బషీర్,భాష, సలీం,మోహిన్,రషీద్,ఖాసిం భాయ్, తదితర ముస్లిం సోదరులు భారీ సంకల్ పాల్గొన్నారు

## రామకోటి రామరాజు భక్తి అమోఘం అని సన్మానించి భద్రాచల 100కిలోల తలంబ్రాలు స్వాగతం పలికిన అడిషనల్ సివిల్ జడ్జి ప్రియాంక




ఏప్రిల్ 25( వాయిస్ టుడే): భద్రాచల రామయ్య కల్యానానికి శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వారు 250కిలోల గోటి తలంబ్రాలు అందించి భక్తిని చాటుకున్న రామకోటి రామరాజుకు తిరిగి 100కిలోల ముత్యాల తలంబ్రాలు బహుకరించగా శుక్రవారం నాడు స్థానిక సరస్వతీ శిశు మందిర్ లో అడిషనల్ సివిల్ జడ్జి ప్రియాంక, ముఖ్య అతిథిగా హాజరై స్వాగతం పలికారు. అనంతరం జడ్జి ప్రియాంక మాట్లాడుతూ భద్రాచల దేవస్థానం రామకోటి రామరాజు భక్తికి మెచ్చి 100కిలోల ముత్యాల తలంబ్రాలు అందించడం దాని వెనక నిరంతర కృషి పట్టుదల ఎంతో ఉందన్నారు. సీతారాముల కల్యానానికి లక్షల మంది 250కిలోల గోటి తలంబ్రాలు అందించడం. వారందరికీ తిరిగి 100కిలోల తలంబ్రాలు తీసుకొచ్చి గ్రామ, గ్రామన పంపిణికి రామకోటి రామరాజు శ్రీకారం చుట్టడం అయన రామభక్తి అమోఘం అని శాలువాకప్పి భగవతద్గీత పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. మమ్మల్ని కూడా భాగస్వాములను చేయడం సంతోషంగా ఉందన్నారు. సామజిక సమరసత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు మాట్లాడుతూ రాముని కోసమే తన జీవితం అంకితం చేసిన రామకోటి రామరాజు ధన్యుడన్నారు. 100కిలోల భద్రాచల తలంబ్రాలు మన గ్రామానికి తీసుకురావడం అనంతరం తెలంగాణ అంతట పంపిణి చేయడం అభినందనీయం అన్నారు. సరస్వతీ శిశు మందిర్ ప్రిన్సిపల్ కొరిడే హరినాపవన్ మాట్లాడుతూ గోటి తలంబ్రాల్లో మమ్మల్ని బాగా స్వాములను చేయడం, మళ్ళీ మాకు ముత్యాల తలంబ్రాలు అందించడం అపర రామ భక్తునిగా పేరు పొందిన రామకోటి రామరాజుకే సాధ్యం అన్నారు.




## రమణ ఆశయాలు కొనసాగిస్తాం

ఏప్రిల్ 25( వాయిస్ టుడే): టిపిటిఎఫ్,సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో టిపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కందుకూరి రమణ, సంస్కరణ సభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ఉపాధ్యాయ భవన్లో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చిట్యాల విజయేందర్ రెడ్డి, అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అసోసియేట్ అద్యక్షులు తిరుపతి రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి దామర రాజయ్య, హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి, రాజయ్య, మాట్లాడుతూ ఫెడరేషన్ ఆశయ సాధన కోసం సామాజిక సమస్యలు పరిష్కారం కోసం ఫెడరేషన్ విస్తరణ కోసం కామ్రేడ్ కందుకూరు రమణ, ఎంతో కృషి చేశారని అన్నారు.ఓకే భావజాలంతో పనిచేసే సంఘాల ఐక్యత కోసం కృషిచేసి విజయం సాధించారని ఆయన సేవలను కొనియాడారు రమణా, పూర్వ కరీంనగర్ జిల్లాలో నిజామాబాద్ జిల్లాలో ఫెడరేషన్ విస్తరణ కోసం ఎంతో కృషి చేశారని అన్నారు.

ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్లు రాజులు, జమీర్, రామస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహా రెడ్డి, ర్యాకం మల్లేశం, అజీజ్, ప్రభాకర్, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, శివాజీ, సత్యక్రిష్ణ, శ్రీనివాస్, రాములు, మండలాల బాధ్యులు సుధాకర్ రెడ్డి, కనకయ్య,ఎల్లం, రాజేందర్, రాజు సీనియర్ నాయకులు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఔదార్యం బత్తిని మహేష్ కుటుంబానికి ఇరవై ఐదు వేలు అందజేత



సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా ఏప్రిల్ 25 వాయిస్ టుడే: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదాన వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సుల్తానాబాద్ పట్టణానికి చెందిన క్యాన్సర్ బాధితుడు బత్తిని మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, నిరుపేద కుటుంబం కాగా బత్తిని మహేష్ భార్య ఇద్దరు కూతురు లు ఉన్నారు.కుటుంబం బజారున పడకూడదన్న లక్ష్యంతో సుల్తానాబాద్ వాకర్స్ తమ ఔదార్యాన్ని చాటి చెప్పి, బత్తిని మహేష్ కుటుంబ సభ్యులకు తమ వంతు సహాయంగా ఇరవై ఐదు వేల రూపాయల ఫిక్స్ డిపాజిట్ బాండును అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందించిన వాకర్స్ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ సభ్యులు ఐల రమేష్, మంద శ్రీనివాస్ గౌడ్,కొమురవెల్లి భాస్కర్, చొప్పరి సుమన్, వాసాల శ్రీనివాస్ రిటైర్డ్ హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఎలగందుల మల్లేశం, ఉల్లంగుల శ్రీనివాస్, కొలిపాక రవీందర్, వెంకటేష్, ఫెగడ పరుశరాములు, దూడం లింగమూర్తి, ప్రశాంత్, నిట్టూరి శ్రీనివాస్, సుంక వేణు ఎలిగేటి రమేష్, కామణి వెంకటేశం, కందునూరి కుమార్, బిక్షపతి, చంద్రమౌళి, జాన్వి శ్రీనివాస్, స్వామి, ఆవుల శివ, రామకృష్ణ, రాజమొగిలి, సుధాకర్, సంజీవరెడ్డి, రామారావు, సంపత్, కొయ్యడ సంతోష్, ప్రభాకర్, పెందోట శ్రీనివాస్,వాకర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



# వాయిస్ టుడే కథనానికి స్పందించిన పట్టణ కాంగ్రెస్ నాయకులు

## బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేత

రామకృష్ణాపూర్ ఏప్రిల్ 25 ( వాయిస్ టుడే): మంచిర్యాల నుండి రామకృష్ణాపూర్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో అడిషనల్ క్లర్క్ ఎం.ఎం రావు, బస్ స్టేషన్ మేనేజర్ గోలి శంకర్ లకు రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, పిసిసి ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి వినతిపత్రం సమర్పించారు. క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పూర్తయి రాకపోకలు సాగుతున్నాయని, బస్సు సౌకర్యం లేక స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.దీనికి అనుగుణంగా మంచిర్యాల నుండి క్యాతనపల్లి మీదుగా రామకృష్ణాపూర్, ఆర్కే.1 వరకు బస్సు సౌకర్యం కల్పిస్తే క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు,విద్యార్థులకు ఉపాధి కోసం జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించే వారికి బస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు వారం రోజుల్లో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపు రాజం, పలిగిరి కనకరాజు, రామ్ సాయి, భాస్కర్ ,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




## పెహల్గమ ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య

### కోడిమాల శ్రీనివాసరావు. ఠాగూర్ రతన్ సింగ్

వరంగల్ ( వాయిస్ టుడే ) ఏప్రిల్ 25 : ఏవి వి జూనియర్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం కాశ్మీర్ లోని పెహల్గామ లో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ మరియు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక పర్యాటకులకు ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ మరియు నివాళులు అర్పించడం జరిగినది . పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమాయక పర్యాటకులపై దాడి అతి నీచమైనదని దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని మరియు భారత ప్రభుత్వానికి మేము అండగా ఉంటామని మరి ఈ దాడిలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నామని కోడిమాల శ్రీనివాసరావు మరియు ప్రముఖ పర్యావరణవేత్త ఠాగూర్ రతన్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వాలంటీర్లు సిహెచ్ రమణ ,అఖిల్ , దేవిశ్రీ ప్రసాద్ సాకేత్ ,సాయి హర్షిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్వేతార్క గణపతి ఆలయంలో 27వ వసంతోత్సవాలు

### వసంతోత్సవాల కరపత్రం విడుదల



కాజీపేట, వాయిస్ టుడే: తెలంగాణ గణపతిగా బాసిల్లుతున్న స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ దివ్య క్షేత్రంలో ఈ సంవత్సరం జరిగే శ్వేతార్క గణపతి స్వామి వారి 27వ వసంతోత్సవాలు అనగా పుట్టినరోజు వేడుకల భాగంగా శుక్రవారం పాత్రికేయుల సమావేశాన్ని దేవాలయ చైర్మన్ బ్రహ్మశ్రీ అయినవోలు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణ శర్మ, స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, తుమ్మ శ్రీనివాస్, దేవులపల్లి సదానందం, మైలవరపు శివరాం, లక్క రవి, దుర్గం సుదీర్, మరియు సరిత శ్రీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఇందులో భాగంగా దేవాలయ వైదిక నిర్వహకులు రాధాకృష్ణశర్మ మాట్లాడుతూ ప్రతిరోజు కూడా వివిధ వైవిధ్యకరమైనటువంటి హవన కార్యక్రమాలు మరియు విశేష ఫిదా కల్యాణ మహొూత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం అయినవోలు సాయి కృష్ణ శర్మ మాట్లాడుతూ ప్రతిరోజు కూడా ఉదయం విశేష అభిషేకాలు మరియు రాత్రి వేళలో రాజ దర్బార్ సేవలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని అన్నారు. మరియు విశేషంగా గజానన సేవ, గజారోహణం కూడా పురవీధుల్లో ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిరోజు జరిగే పూజా కైంకర్యాలు ప్రత్యక్ష ప్రసారంలో కలదు అని దేవాలయ మీడియా ఇన్చార్జ్ మైలవరం శివరాం తెలిపారు. మరియు వసంతోత్సవంలో ఒకరోజు ఉచిత వైద్య శిబిరం కూడా ఉంటుందని సరిత శ్రీ తెలిపారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ ఉత్సవాలలో పూర్తిస్థాయిగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. వివరాలకు దేవాలయ ఫోన్ నెంబర్ 9347080055 సంప్రదించగలరని తెలియజేశారు.



## మహేష్‌ను అభినందించిన మందకృష్ణ

### ఉద్యమంలో ఉన్నత శిఖరాలను అవరోధించాలి

కాజీపేట, వాయిస్ టుడే: డాక్టర్ బీఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దళిత రత్న అవార్డుకు ఎంపికై అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటిక రాజు చేతుల మీదుగా స్వీకరించిన ఎంఆర్పీఎస్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు రేణుకుంట్ల ఉమామహేశ్ ను ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అభినందించారు. గురువారం దళిత రత్న అవార్డు గ్రహీత రేణుకుంట్ల ఉమామహేష్ మందకృష్ణ మాదిగ ను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఉద్యమంలో మహేష్ చేసిన పోరాటాలను గుర్తుచేశారు. గత పది సంవత్సరాలుగా మహేష్ ఎంఆర్పీఎస్ బలోపేతానికి కృషిచేశారని, ఉద్యమం కోసం జరిగిన కొన్ని పోరాటాల్లో పోలీసు కేసుల పాలు అయ్యాడని, అయినప్పటికీ ఎవరికీ భయపడకుండా ఎంఆర్పీఎస్ ఇచ్చిన ప్రతీ పిలుపులో ముందుండి నడిచాడని అన్నారు. రానున్న రోజుల్లో మాదిగ జాతి అభివృద్ధి కోసం జరిగే పోరాటాలలో ముందుండి నడిచి ఉద్యమంలో ఉన్నత శిఖరాలను అవరోధించాలని కోరుకుంటున్నట్టు మందకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఇచ్చిన ప్రతీ పిలుపుకు ముందుండి పోరాడుతానని అన్నారు. ఈ సందర్భంగా మహేష్ మందకృష్ణ మాదిగ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ




వరంగల్ ( వాయిస్ టుడే ) ఏప్రిల్ 25 : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుపేద ఫ్లోర్ వాకర్ దివ్యాంగులకు బొగ్గరపు రామకృష్ణ ఆధ్వర్యంలో దాతలు మహేంద్రన్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వరంగల్ ఉర్సు గుట్ట దగ్గరలో బీరన్న గుడి ఎదురుగా గల కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 15 మంది నిరుపేద ఫ్లోర్ వాకర్ దివ్యాంగులకు ఉచితంగా వీల్ చైర్ పంపిణీ చెయ్యడం జరిగింది. ఇలా దాతల సహాయంతో నిరుపేద దివ్యాంగులకు అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న బొగ్గారపు రామకృష్ణ కి మరియు వారికి సహకరిస్తున్న దాతలకు మరియు వారి కుటుంబ సభ్యులకు దివ్యాంగుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామనీ యం అజీమ్ అన్నారు.

అలాగే ఆ భగవంతుడు వీరికి అష్ట ఐశ్వర్యాలు ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలు కలిగించాలని దివ్యంగుల పక్షాన ఆ భగవంతున్ని కోరుకుంటున్నానమనీ అయన అన్నారు. ఇదేవిధంగా భవిష్యత్తులో కూడా బుగ్గారపు రామకృష్ణ ఇలాంటి అనేక సేవ కార్యక్రమాలు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుమని అయన తెలిపారు.

వీల్ చైర్ కావలసిన నిరుపేద ఫ్లోర్ వాకర్ దివ్యాంగులు నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం దృష్టికి తీసుకొస్తే ఖచ్చితంగా వారికి రామకృష్ణ ఆధ్వర్యంలో దాతల సహాయంతో సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు

. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు యం డి అజీమ్ , ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బండి చక్రపాణి , వరంగల్ జిల్లా అధ్యక్షులు గై సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని రాజు, జిల్లా కోశాధికారి దీకొండ సాయిరామ్ మరియు కార్యవర్గ సభ్యులు సాధిక్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దివ్యాంగులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి

### పోలీస్ కమీషనర్ సునీల్ దత్

పాలేరు ఏప్రిల్ 25 వాయిస్ టుడే: పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) కేంద్రాన్ని, రాజేశ్వరపురం లోని అరుణచల రైస్ మిల్లును ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో ఆయన పర్యవేక్షిస్తూ... దాన్యం, కొనుగోలు, ట్రాన్స్‌పోర్ట్, కాంటాలు,బిల్లులు తదితర అంశాలపై జరుగుతున్న విషయాలు అడిగి తెలుసుకొన్నారు.అనంతరం మిల్లర్లతో మాట్లాడారు. రైతులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, మిల్లర్లకు, అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సిఐ సంజీవ్,ఎస్సై సంతోష్ పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవ భారీ ర్యాలీ

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా ఏప్రిల్-25వాయిస్ టుడే: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని శుక్రవారం గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి, గర్రెపల్లి వీధుల గుండా మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించామని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఉదయ్ కుమార్ తో పాటు సూపర్వైజర్ వెంకట్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు..



## మున్నూరు కాపు ముద్దుబిడ్డ... యుపిఎస్సి ర్యాంకర్ చరణ్ తేజ్‌కు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సత్కారం

ఖమ్మం జిల్లా చింతకాని నామారం గ్రామం నర్సింశెట్టి హరనాథ్ బాబు-నాగమణి దంపతుల రెండవ కుమారుడైన చరణ్ తేజ ఐ ఎ యస్ లో స్టేట్ ర్యాంకు సాధించి మన ఘనతను చాటి చెప్పిన మున్నూరు కాపు ముద్దు బిడ్డకు మున్నూరు రాష్ట్ర కాపు జిల్లా నాయకత్వం ఘన సత్కారం చేయడం జరిగింది.ఖమ్మంబీవీడివోస్ కాలనీ పగడాల కిషోర్ వారి ఇంటినందు జరిగిన కార్యక్రమంలో మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శి మరియు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీ శెట్టి రంగారావు, మున్నూరు కాపు నగర అధ్యక్షులు మదూరి పూర్ణచంద్రరావు, నగర నాయకులు సముద్రాల శ్రీనివాసరావు, సంపటి నర్సింహరావు, మాటేటి రవి, కమతం రఘు మరియు జిల్లా రిపోర్టర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## రేషన్ బియ్యం కాటా చేసి ఇవ్వాలని తహసీల్దారుకి వినతిపత్రం

ముదిగొండ మండలం ఏప్రిల్ 25 వాయిస్ టుడే : ముదిగొండ మండలంలోని ఉన్న రేషన్ డీలర్ షాపులకు గోడౌన్ లో కాటా వేసి బియ్యం ఇవ్వాలని ముదిగొండ తహసీల్దారు సునీతా ఎలిజబెత్ కి శుక్రవారం రేషన్ డీలర్ సంఘం తరుపున వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు సునీతా ఎలిజబెత్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని డీలర్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, మండలంలో ఉన్న ప్రజలందరూ సన్న బియ్యం తీసుకెళ్ళాలని కొరారు. డీలర్ షాపులకు ఇచ్చే బియ్యాన్ని ఆర్ఐ వచ్చే స్టాక్ కాటా వేసి ఇచ్చేలా చర్యలు తీసుకొవాలని వినతిపత్రంలో వారు కోరడంతో రెవిన్యూ ఇన్స్పెక్టర్ తో మాట్లాడి కాటా వేసి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## రజతోత్సవ మహాసభకు బయలుదేరిన ప్రభబండి స్వయంగా ప్రభబండిని నడిపిన మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి




ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా గీసుకొండ మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొమ్మాల గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ఆర్చి వద్ద ఏర్పాటుచేసిన ప్రభబండిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ఆర్చి నుండి కొమ్మాల బస్టాండ్ వరకు తానే స్వయంగా ప్రభబండిని నడిపి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.